

కౌంటింగ్ ఫీవర్

- ఎక్కడ చూసినా ఓట్ల లెక్కింపుపైనే చర్చ
- జూన్ నాలుగున హోటళ్లు, రిసార్టులకు డిమాండ్
- స్నేహితులతో కలిసి ఫలితాలు వీక్షించేందుకు ఏర్పాట్లు
- రూమ్‌ల అడ్వాన్సు బుకింగ్

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి):
నగరంలో ఎక్కడచూసినా ఓట్ల లెక్కింపునకు సంబంధించిన చర్చే నడుస్తోంది. రాష్ట్ర శాసనసభతోపాటు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల నాలుగో తేదీన వెల్లడి కానున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో రకరకాల విశ్లేషణలు కొనసాగుతున్నాయి. పోలింగ్ తమకు అనుకూలంగా జరిగిందంటూ ఇటు కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నాయకులైతే ఒకడుగు ముందుకువేసి వచ్చే నెల తొమ్మిదో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ప్రకటించారు. మరోవైపు తమ విజయం ఖాయమని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీంతో ఎవరు విజయం సాధిస్తారో ఒక పట్టాన అంతుచిక్కడం లేదు. ఫలితాలపై బెట్టింగ్‌లు కూడా జోరుగానే జరుగుతున్నాయి. అయితే అత్యధికులు కూటమి మొగ్గు చూపుతుండడంతో 2:1 నిష్పత్తిలో పందాలు సాగుతున్నాయి.

ఇదిలావుంటే ఎన్నికల ఫలితాలను గుర్తుండిపోయే రీతిలో వీక్షించాలని చాలామంది ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్నేహితులంతా కలిసి ఒకచోట ఉండి టీవీల్లో ఫలితాలను వీక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం నగర శివార్లలో రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లతోపాటు నగరంలోని ప్రధాన హోటళ్లు, లాడ్జిల్లో రూమ్‌లను అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్నారు. జూన్ నాలుగు తేదీన రూమ్‌ల కోసం డిమాండ్ పెరిగిపోయింది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లోని రిసార్టులు, బీచ్‌రోడ్డులోని గెస్ట్‌హౌస్‌లు, నగరంలోని పలు స్టార్ హోటళ్లలో రూమ్‌లు దాదాపు ఫుల్ అయిపోయినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

జీతాల పంపిణీలో వివక్ష

- కొందరికి పూర్తిగా చెల్లింపు
- మరికొందరికి సగం కూడా ఇవ్వని వైనం
- ఉక్కు యాజమాన్యం వింత వైఖరి

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగులు అందరి పట్ల ఒకే రకంగా వ్యవహరించకుండా 'విభజించు.. పాలించు' రీతిలో వ్యవహరిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంతకాలంగా జీతాలు సకాలంలో ఇవ్వలేకపోతున్న సంగతి తెలిసిందే. ఎగ్జిక్యూటివ్‌లు (అధికారులు), నాన్ ఎగ్జిక్యూటివ్‌లు (కార్మికులు), కాంట్రాక్టు కార్మికులు, పెన్షనర్లకు నెలకు రూ.100 కోట్ల పైనే చెల్లించాల్సి ఉంది. ఇటీవల సగం సగం చొప్పున ఇస్తున్నారు. అది ఆమోదయోగ్యం కావడంతో ఎవరూ నోరు విప్పలేదు. వ్యతిరేకించలేదు. ఏప్రిల్ నెల జీతాలు మే నెల మొదటి వారంలో ఇవ్వాల్సి ఉండగా నాన్ ఎగ్జిక్యూటివ్‌లు ఆందోళన చేస్తుండడంతో వారికి రెండు రోజుల క్రితం 50 శాతం జీతాలుగా రూ.22 కోట్లు ఇచ్చారు. ఆ తరువాత తమకు ఇస్తారని ఎగ్జిక్యూటివ్‌లు, పెన్షనర్లు భావించారు. కానీ యాజమాన్యం అలా చేయకుండా గురువారం కూడా మిగిలిన 50 శాతం జీతాలుగా ఇంకో రూ.22 కోట్లు కార్మికులకే ఇచ్చింది. ఈ విషయం తెలిసి అధికారులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అందరికీ కుటుంబాలు ఉన్నాయని, సమస్యలు అందరికీ సమానమేనని, అంతా ప్లాంటు కోసమే పనిచేస్తున్నామని, ఇలా వివక్ష చూపడం తగదని విమర్శిస్తున్నారు. అధికారుల్లో సీనియర్ మేనేజర్ కేడర్ వరకు ముందుగా జీతాలు ఇవ్వాలని సీఎండీని కలిసి కోరితే...విజ్ఞప్తులు పట్టించుకోకుండా మళ్లీ కార్మికులకే జీతాలు ఇవ్వడం అన్యాయమని వాపోతున్నారు. అధికారుల తరఫున జీతాలు అడిగితే.. ఎవరి పేమెంట్లు ఆపేయమంటారు? అంటూ ప్రశ్నిస్తున్నారని, పనిచేసినందుకే జీతాలు అడుగుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా పక్షపాతం వీడి తక్షణమే అధికారులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్ రహదారిలో పనులు సగంలో ఆపేయడంతో ప్రయాణికులను కమ్మేస్తున్న ధూళి

బాబోయ్... ఇదేం రోడ్డు

మహా నిర్లక్ష్యం

- నత్తనడకన బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్మాణం
- అడవివరం వద్ద అడ్డదిడ్డంగా పనులు
- నవంబరులో ప్రారంభం
- 3 నెలల్లో పూర్తిచేస్తామని హామీ...
- 6 నెలలైనా పూర్తికాని వైనం
- దుమ్ము, ధూళి రేగుతుండడంతో వాహనచోదకుల పాట్లు
- అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తుల అవస్థలు
- 70 మందికి ఇంకా అందని టీడీఆర్‌లు..
- ఇదీ జీవీఎంసీ అధికారుల తీరు

(విశాఖపట్నం, సింహాచలం-ఆంధ్రజ్యోతి)

సింహాచలం గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకూ చేపట్టిన బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు నెలల్లో పూర్తిచేస్తామని ప్రకటించి ఆరు నెలలైనా ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. ఆ ప్రాంతంలో ధూళి రేగుతూ ప్రయాణికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సింహాచలం పుణ్యక్షేత్రానికి యాత్రికులు వేల సంఖ్యలో వచ్చే రోజులివి. అన్నీ తెలిసినా జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

జీవీఎంసీ అధికారులు సింహాచలం బీఆర్‌టీఎస్ రహదారి పనులను నవంబరు నెలలో ఆకస్మికంగా చేపట్టారు. గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు రహదారిని 100 అడుగులకు విస్తరించేందుకు నడుం కట్టారు. అనేక భవనాలు అడ్డంగా ఉండడంతో రాత్రికి రాత్రి వాటిని కూల్చివేశారు. స్థానికులు ఆందోళనకు దిగడంతో నష్టపరిహారంతో టీడీఆర్‌లు ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 273 నిర్మాణాలను కూలగొట్టారు. ఇందులో కూడా అధికార పార్టీ వారికి లబ్ధి కలిగేలా అధికారులు వ్యవహరించారు. వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు ఎక్కువ పరిహారంతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చారు. అదే ఇతర పార్టీలకు చెందినవారు, ఎదురు ప్రశ్నించలేని వారికి నష్టం కలిగించారు. బాధితుల్లో 200 మందికి టీడీఆర్‌లు ఇచ్చారు. ఇంకా 73 మందికి ఇవ్వకుండా తిప్పలు పెడుతున్నారు. టీడీఆర్‌లు తీసుకున్నవారు వాటిని అమ్ముకుందామని ప్రయత్నిస్తే...అవి చెల్లుబాటు కావని, 'నాట్ ఫర్ సేల్' అని వెబ్‌సైట్‌లో చూపిస్తోంది. అంటే టీడీఆర్ తీసుకున్న వారు తప్పనిసరిగా వారే దానిని ఉపయోగించుకోవాలి. అమ్ముకునే అవకాశం లేదు.



పాత గోశాల జంక్షన్ వద్ద ధూళి రేగడంతో వాహన చోదకుల అవస్థలు

ఇదిలావుండగా గత ఏడాది నవంబరులో ప్రారంభించిన పనులు ఇప్పటివరకూ పూర్తి చేయలేదు. నచ్చినప్పుడు చేయడం, ఆ తరువాత వదిలేయడం అన్నట్టుగా సాగుతున్నాయి. ఈ నెల 10వ తేదీన చందనోత్సవం జరగడంతో, భక్తులు లక్షలాదిగా వస్తారని అప్పటికప్పుడు కొన్ని పనులు చేశారు. ఆ తరువాత మళ్లీ వదిలేశారు. ఫ్లైయాష్ తీసుకువచ్చి పోసేయడంతో ఎండకు అది తేలికై..చిన్నపాటి గాలికే పైకి లేస్తోంది. వాహనాలు వెళుతున్నప్పుడు వాటితో పాటు

... మిగతా 6వ పేజీలో

పోలీసుల తనిఖీలు

- ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
- మద్యం సీసాలు, ఎటువంటి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం



బర్మాక్యాంప్ కాలనీలో మద్యం సీసాలు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి):
ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గరపడుతుండడంతో నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలపై దృష్టిసారించారు. అందులో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో గురువారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జోన్-2 వెస్ట్ సబ్ డివిజన్ పరిధి కంచరపాలెం స్టేషన్ పరిధిలోని బర్మా క్యాంపు కాలనీ, సౌత్ సబ్‌డివిజన్ గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జోగివానిపాలెం, హార్బర్ సబ్ డివిజన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రసాద్ గార్డెన్స్‌లో ఉదయం ఆరు గంటల నుంచే పోలీసులు ఏకకాలంలో ప్రతి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 55 మద్యం బాటిళ్లతో పాటు పత్రాలు లేని 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన కొంతమందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించిన తర్వాత విడిచిపెట్టారు. ఈ సందర్భంగా డీసీపీ-2 ఎం.సత్తిబాబు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 39,997 మంది విద్యార్థులు
- ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహణ

మద్దిలపాలెం, మే 23: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం ఉదయం 49 పరీక్షా కేంద్రాలు, మధ్యాహ్నం 10 కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడకుండా అన్ని గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. సప్లిమెంటరీ పరీక్షలకు 39,997 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 31,768 మంది, ద్వితీయ సంవత్సరం 8,229 మంది ఉన్నారు. మార్చిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 8,768 మంది ఫెయిల్ అయ్యారు. వారితో పాటు ఉత్తీర్ణత సాధించిన 23 వేల మంది బెటర్‌మెంట్

... మిగతా 6వ పేజీలో

కేజీబీవీ టీచర్ల పనితీరు మదింపు

- భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు కూడా పరిశీలన
- విద్యా శాఖ ఆదేశం
- సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు బాధ్యత
- ప్రభుత్వం తీరుపై టీచర్లు అభ్యంతరం

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి):
కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు మదింపు చేయాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. అయితే దీనిపై ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కేజీబీవీలు ఏర్పాటైన తరువాత ఎప్పుడూ లేని విధానాలను ఉన్నతాధికారులు అవలంబిస్తున్నారని అంటున్నారు.

కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీలు), భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులను ప్రతి ఏడాది విద్యా సంవత్సరంలో ఒకరోజు విరామంతో కొనసాగిస్తుంటారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే సర్వీస్ బ్రేక్ ఉంటుంది. ఈ ఏడాది గత నెల 24వ తేదీతో విద్యా సంవత్సరం ముగిసింది. ఒకరోజు ముందు అంటే 23వ తేదీతో వీరి సర్వీస్‌కు విరామం ఇచ్చిన అధికారులు తిరిగి జూన్ తొమ్మిదో తేదీ వరకూ మాత్రమే పొడిగింపు ఇచ్చారు. దీనిపై అప్పట్లోనే కేజీబీవీ టీచర్లంతా అనుమానం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కేజీబీవీ, భవిత కేంద్రాల్లో టీచర్ల పనితీరు మదింపు చేయాలని తాజాగా ఉన్నతాధికారులు నిర్ణయించి జిల్లాలకు ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో



వృత్తిలో నైపుణ్యం కోసం ఈ వేసవిలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయినులు

34 కేజీబీవీలలో సుమారు 700 మంది, వందకుపైగా భవిత కేంద్రాల్లో పనిచేసే సుమారు 100 మంది టీచర్ల పనితీరు మదింపు (20 మార్కులకు) బాధ్యతను సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి ఫార్మెట్ కాపీలు వచ్చాయి. పనితీరు బాగాలేదన్న సాకుతో కొందరిని బయటకు పంపేందుకు ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని ఉపాధ్యాయులు కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది తమ డిమాండ్ల సాధనకు కేజీబీవీ టీచర్లు పలు దశల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దానిని గుర్తు పెట్టుకుని ఉన్నతాధికారులు ఇప్పుడు కక్ష సాధింపునకు దిగుతారేమోనన్న ఆందోళనను వ్యక్తంచేస్తున్నారు. ఒకపక్క పనితీరు మదింపుపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు మరోవైపు వేసవి సెలవులతో సంబంధం లేకుండా టెన్త్, ఇంటర్ తప్పిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే బాధ్యతను టీచర్లకు అప్పగించారు. సుమారు నెల రోజుల నుంచి ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ప్రభుత్వ బడుల కంటే కేజీబీవీలు మెరుగైన ఫలితాలు సాధించాయని, ఉన్నతాధికారులు ఈ విషయం కూడా గమనించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎండలు మండిపోతుండడమే కారణం

భారీగా విద్యుత్ వినియోగం



- పెరుగుతున్న అప్రకటిత కోతలు
- నిర్వహణ పనుల కోసమేనంటున్న అధికారులు
- అధికారికంగా ఎక్కడా కోతలు విధించడం లేదని ప్రకటనలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)
ఎండలు మండిపోతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు పడతాయనుకుంటే కనీసం సాయంత్రం పూట గాలులు కూడా వీయడం లేదు. ఒకటే ఉక్కపోత. తట్టుకోలేనంత వేడి. దీంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. సాధారణ డిమాండ్‌కు మించి వాడేస్తున్నారు. ఏసీల కొనుగోళ్లు పెరిగాయి. అంతా సాయంత్రం ఏడింటికే వాటిని ఆన్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా ఈపీడీసీఎల్ అధికారులు గత ఏడాదే ఎక్కడికక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా సమస్యలు తప్పడం లేదు. ఓవర్ లోడ్ వల్ల కొన్నిచోట్ల లైన్లు ట్రిప్ అవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఫ్యూజులు పోతున్నాయి. ఎవరికి విద్యుత్ లేకపోయినా వెంటనే ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తుండడంతో ఆ ఏరియాలో మరమ్మతుల కోసం అందరికీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇలాంటివి సమస్యను బట్టి అరగంట నుంచి గంట సమయం తీసుకుంటున్నాయి. ఇలా అనేక ప్రాంతాల్లో రిపేర్లు కోసం ఆపుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహణ పనులు పేరుతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

... మిగతా 6వ పేజీలో

విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో...)

తేదీ	2022	2023	2024
మే 15	28.100	31.376	28.763
మే 16	27.816	32.070	27.903
మే 17	25.981	32.371	28.377
మే 18	26.151	31.374	29.057
మే 19	23.008	31.473	28.743
మే 20	24.765	30.271	30.133
మే 21	26.060	31.450	30.631
మే 22	24.812	31.301	30.547

విశాఖపట్నం సర్కిల్‌లో రోజువారీ సగటు వినియోగం 28.364 మిలియన్ యూనిట్లు. కాగా బుధవారం 2.183 మి.యూనిట్లు అధికంగా ఉపయోగించారు. అంటే 20,18,300 యూనిట్లు ఎక్కువ వాడేశారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఇది తక్కువేనని, ఇంకా ఎక్కువ వినియోగించే రోజులు ముందున్నాయని అధికారులు చెబుతున్నారు.

పాఠశాలలకు పుస్తకాలు

- ఉమ్మడి జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 21,71,180 పాఠ్య పుస్తకాలు అవసరం
- ఇప్పటివరకూ 6,20,000 రాక
- మండలాలకు పంపుతున్న అధికారులు

గాజువాక/ఆటోనగర్, మే 23:
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు గాజువాక ఆటోనగర్‌లో గల గోదాముకు చేరుకుంటు న్నాయి. ఇక్కడ నుంచి అధికారులు పాఠశాలలకు పంపుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 46 మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు 21,71,180 పుస్తకాలు అవసరం. అయితే ఇప్పటివరకూ గాజువాకలో గల జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కేంద్రం గోదాముకు మూడో వంతు కంటే తక్కువ...కేవలం 6,20,000 వరకూ మాత్రమే వచ్చాయి. గత ఏడాది మిగిలిపోయినవి రెండు లక్షల వరకూ ఉన్నాయి. మొత్తం కలిపితే 8,20,000. ప్రస్తుతం వీటిని ఆర్టీసీ కార్గో సర్వీసులలో అన్ని మండలాలకు పంపుతున్నారు. పాఠ్య పుస్తకాల పంపిణీ చేసేందుకు కార్గో సర్వీస్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారిని స్వర్ణలత రెండు రోజుల క్రితం ప్రారంభించారు.



గాజువాక ఆటోనగర్‌లోని గోదాములో పాఠ్యపుస్తకాలు

ఇదిలావుండగా ఒకటి నుంచి ఏడో తరగతి వరకు (నాలుగో తరగతి మినహా) పాఠ్య పుస్తకాలు ప్రస్తుతం కార్యాలయానికి చేరాయి. ఇవి కూడా తక్కువగానే వచ్చాయి. ఈ వారంలోగా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ శ్రీనివాస్

... మిగతా 6వ పేజీలో


బస్సుల కోసం చలివేంద్రం పందిరిలో వేచి ఉన్న ప్రయాణికులు


కళింగనగర్ వద్ద బస్టాపు స్థలంలో నిర్వహిస్తున్న కూరగాయల దుకాణం

రోడ్డు విస్తరణతో సరి..బస్ షెల్టర్ల నిర్మాణమేదీ?

- ఉత్తర నియోజకవర్గంలో దుస్థితి
- 48ఏ సిటీ బస్సు రూట్‌లో అవస్థలు
- కళింగనగర్‌లో షెల్టర్ స్థలం ఆక్రమణ

మాధవధార, మే 22: గత ఐదేళ్లలో విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న పాలకుల ప్రకటనలకు, వాస్తవానికి పొంతన కుదరడం లేదు. రూ.కోట్లతో ఇటీవల నవీకరించిన మాధవధార, కైలాసపురం, సీతమ్మధార ప్రాంతాలకు చెందిన రహదారిలో 48ఏ సిటీ బస్సు నడుస్తోంది. రోజులో కొన్ని ట్రిప్పులు మాధవధార ఉడాకాలనీ నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, మధుసూదన్ నగర్ ప్రాంతాల నుంచి పోర్టు హాస్పిటల్ మీదుగా అక్కయ్యపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సునుంచి వన్‌టౌన్ పాతపోస్టాఫీసు చేరుతోంది. అయితే, ఈ ఒక్క బస్సు కోసం కొత్తగా షెల్టర్లు కట్టడం ఎందుకు అనుకున్నారో ఏమో వైసీపీ పాలకులు. ఉన్న వాటితోనే రోడ్డు విస్తరణ పనులు కానిచ్చేశారు. ఈ క్రమంలో మాధవధార, మురళీనగర్, ప్రధానంగా కళింగనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీల్లో పాతవే కొనసాగుతున్నాయి.. కొత్తగా ఒక్క షెల్టరూ నిర్మించలేదు. దిగువ హైవే రోడ్డులో, బీఆర్‌టీఎస్ రోడ్డులో బస్సులు ఆగనిచోట షెల్టర్లు నిర్మించారు. ఎంపీల్యాడ్స్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ నిధులతో చాలాచోట్ల ఈ విధంగా ఏర్పాటుచేసిన బస్టాప్‌లు వృధాగా దర్శనమిస్తున్నాయి.

మాధధార 48ఏ బస్సు రూట్‌లో మాత్రం బస్సులు ఆగే చోట షెల్టర్లు నిర్మించలేదు. ఇందుకు సంబంధించి స్థలాలు కూడా దుకాణదారుల ఆక్రమణలకు లోనవుతున్నాయి. కళింగనగర్ బస్టాపులో ప్రయాణికులు వేచి చూసే చోట గతంలో ఉన్న చెట్టును రోడ్డు నిర్మాణం పేరిట తొలగించారు. చదును చేసిన ఈ స్థలంలో ప్రజా ప్రతినిధుల మద్దతుతో కూరగాయల దుకాణం వెలిసింది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు చలివేంద్రంపాకలో, రోడ్డు అవతల నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 23: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బీ.సింహాచలం నాయుడు తెలిపారు. కైలాసపురం ప్రధానరహదారి, కస్తూరినగర్, దుర్గా కైలాసనగర్, నరసింహనగర్, రైతుబజారు, విద్యుత్ నగర్, కిరణ్ పార్కు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఐవోపీఎల్‌లో పర్యావరణ హిత ఇంధనం

మహారాణిపేట, మే 23: పర్యవరణానికి మేలు చేసేలా నాణ్యమైన ఉత్పత్తులను అందించగల సామర్థ్యాన్ని ఇండియన్ ఆయిల్ సాధించిందని సంస్థ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ తెలిపారు. మహారాణిపేటలోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టయిల్‌పైప్ ఉద్గారాలతో పర్యవరణానికి అనుకూలంగా ఆక్టేన్ పెట్రోల్‌ను అభివృద్ధి చేశామన్నారు.

నేడు నీటి సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 23: సీతమ్మధార టీడీపీ కాలనీలో 400 ఎంఎం ఎసి పంపింగ్ మెయిన్ పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తామని కార్యనిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, రాధా కృష్ణ లేఅవుట్, 16వ వార్డులో కేఆర్‌ఎం కాలనీ, భానునగర్, 24వ వార్డులో టీడీపీ కాలనీ, పిఅండ్‌టి కాలనీల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

సంజీవని నిధికి హెచ్‌పీసీఎల్ ఉద్యోగుల విరాళం

మహారాణిపేట, మే 23: అనారోగ్యంతో బాధపడే పేదలకు సాయం చేసేందుకు వీలుగా నెలకొల్పిన సంజీవని నిధి, డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు రూ.6,45,000 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని సంజీవని నిధి బ్యాంకు ఖాతాలో జమ చేసి, ఆ పత్రాలను హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్ గురువారం కలెక్టర్ ఎ.మల్లికార్జునకు అందజేశారు. హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు చూపిన చొరవకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం



జగదాంబ కూడలి, మే 23: వన్‌టౌన్ బురుజుపేటలోని కనక మహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకం సేవలను నిర్వహించారు. ఉదయం 8గంటలకు అర్చకులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


బుద్ధుని విగ్రహం వద్ద వాకర్స్ క్లబ్ సభ్యులు

మాధవధార, మే 23: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో గురువారం వైశాఖ పౌర్ణమి (బుద్ధ పౌర్ణమి) ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సభ్యులు, కార్యవర్గం బుద్ధునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధుని బోధనల్లో సామాజిక శాంతి కోణం, విశిష్టతలను వివరించారు. ధ్యానాన్ని నేటి తరం అలవాటుగా చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్.సత్యనాథం, సి.హెచ్.ప్రసాదరావు, జి.విజయలక్ష్మి, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కులోని బుద్ధుని విగ్రహం వద్ద పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ బుద్ధునికి పూలమాలలతో నివాళులర్పించారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు

కంచరపాలెం: అశోక్‌నగర్ ఆంధ్ర బౌద్ధ సమాజంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దల ఆత్మశాంతి కోసం పూజలు జరిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. వెంకటరావు, భీమారావు, రాము, సునీల్, పరిమళ, హాసిని, దీక్షి, దర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహోన్నతం

అక్కయ్యపాలెం: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. వైశాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం మధ్యాహ్నం రైల్వేన్యూకాలనీలోని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని సీతారాం, ధనలక్ష్మి దంపతులు ప్రారంభించారు. అంతకు ముందు వారు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో నిబంధనలు పాటించాలి: ఆర్డీవో


అభ్యర్థులు, ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆర్డీవో

జ్ఞానాపురం, మే 23: వచ్చే నెల నాలుగో తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపులో పోటీలోని అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను పాటించాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సూచించారు. ఈ మేరకు గురువారం జ్ఞానాపురంలోని కార్యాలయంలో అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహించే విధానాన్ని వివరించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, గోపాలపట్నం తహసాల్దార్ పి.విజయబాస్కర్, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో 16 మందికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, మే 23: రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ, అక్కడే తిష్ట వేసుకుని ఉంటున్న 16 మంది నిరాశ్రయులను టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్, వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. రైల్వేస్టేషన్‌లో చేసిన రెస్క్యూ ఆపరేషన్‌లో గుర్తించినవారిలో 13 మంది పురుషులు, ముగ్గురు మహిళలున్నారని, వీరిలో కొంతమంది బయటకు వెళ్లిపోతామని గొడవ చేస్తున్నారన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి భిక్షాటనకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.


సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిసున్న భక్తులు


ఇసుక కొండ సత్యనారాయణస్వామి

సత్యనారాయణస్వామి ఆలయంలో ఘనంగా వైశాఖ పౌర్ణమి

మహారాణిపేట, మే 23: ఇసుక కొండ శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి మహోత్సవ పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్ సమీపంలోని ఇసుక కొండగా పిలిచే బాబాజీ కొండపై వెలసిన ఆలయానికి భక్తులు పోటెత్తారు. ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఫణిహారంనరసింహాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తురాలు హేమలత ఆధ్వర్యంలో మహాలక్ష్మి, విష్ణు సంకీర్తనలు ఆలపించా. కోలాటం ఆడారు. ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ భక్తులకు తాగునీటితోపాటు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్, మే 23: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 101 జయంత్యుత్సవాల సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. హిందుస్తాన్ జింక్ మైదానంలో నార్త్ నియోజకవర్గానికి చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈనెల 28న ఎన్టీఆర్ జయంతి రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ 51వ వార్డు నేతలు జయరాజ్ (జాన్), పి.మణికంఠ, బుజ్జి, శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు ఐదు బ్యాటరీ వాహనాలు

- సమకూర్చిన విశాఖ స్టీల్‌ప్లాంట్
- ప్రారంభించిన కలెక్టర్ మల్లికార్జున


బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించి, నడపుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మే 23: కేజీహెచ్‌లో రోగులకు రవాణా సేవలు అందించేందుకు వీలుగా ఐదు బ్యాటరీ కార్లను ఆర్‌ఐఎన్‌ఎల్ (విశాఖ స్టీల్‌ప్లాంట్) అంతజేసింది. వీటిని గురువారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ సీఈఆర్ (కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్స్‌బులిటీ ఇనీషియేటివ్) సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా సుమారు రూ.40 లక్షల విలువ చేసే బ్యాటరీతో నడిచే ఐదు వాహనాలను కేజీహెచ్‌కు అందించింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చి, నడవలేని వారు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు, కొండ మీద ఉన్న సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు వెళ్లాల్సిన రోగులు, వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఓపీ నుంచి డయాగ్నొస్టిక్ సెంటర్‌కు వెళ్లేందుకు, ఇన్‌పేషెంట్లను తరలించేందుకు ఉచితంగా వినియోగిస్తారు. వాహనాలను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ దానిని నడిపిన అనంతరం మాట్లాడుతూ విశాఖ ఉక్కు సమాజ శ్రేయస్సు కోసం ప్రజలకు ఉపయోగపడే సేవలందిస్తోందన్నారు. ఈ వాహనాలు రోగులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఆస్పత్రిలో ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అదనపు డైరెక్టర్ ఏకే బాగ్చి, సీజీఎం ప్రవీణ్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్మా క్యాంపు ఘటనపై రెవెన్యూ విచారణ

- వ్యక్తిగత కక్షలని ఏకపక్షంగా నిర్ధారణ
- అధికారిక విచారణ కాదని మరోవైపు వివరణ

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): బర్మా క్యాంపులో వారం క్రితం జరిగిన దాడి ఘటనపై తీరుబడిగా రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. అది కూడా అనధికారికంగానే కావడం గమనార్హం. కూటమి సానుభూతిపరులైన సుంకరి ధనలక్ష్మి కుటుంబంపై వైసీపీకి చెందిన ఒక వర్గం దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. పది మందిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేస్తే ఒక్కరినే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పైగా ఇది వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన ఘటన అని, దీనికి రాజకీయ పార్టీలకు సంబంధం లేదని కంచరపాలెం పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టి మరీ వెల్లడించారు. అయితే, వైసీపీకి ఓట్లు వేయడానికి డబ్బులు ఇస్తామన్నారని, తాము నిరాకరించి, కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసినందుకే కక్ష గట్టి దాడి చేశారని ధనలక్ష్మి కుటుంబం ఆరోపిస్తోంది. ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారడంతో ఎన్నికల సంఘం ఎక్కడ దీనిపై విచారణకు ఆదేశిస్తుందనే భయంతో అధికార వర్గాలు ఈ కేసును రాజీ చేయడానికి యత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా బాధిత కుటుంబాన్ని జాయింట్ కలెక్టర్ రమ్మంటున్నారంటూ బుధవారం సచివాలయ సిబ్బంది ఫోన్ చేసి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. అదే సమయానికి దాడి చేసిన పది మందినీ అక్కడికి రప్పించారు. ఇరువర్గాలను పిలిచి రాజీ చేయాలనుకున్నారేమో...దానికి అంగీకరించకుండా ధనలక్ష్మి కుటుంబం వెనక్కి వచ్చేసింది.

ఆర్‌డీఓ విచారణ

గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం తన పరిధిలోకి వస్తున్నందున ఈ ఘటనలో ఏమి జరిగిందో తెలుసుకోవడానికి ఇరువర్గాలను పిలిపించామని ఆర్‌డీఓ తెలిపారు. అయితే బాధిత వర్గం బయట నుంచే వెళ్లిపోయిందని, దాడి చేసిన వర్గం వారితో మాట్లాడి ఏమి జరిగిందో తెలుసుకున్నామన్నారు. ఇది వ్యక్తిగత కక్షలతో చేసిన దాడిగానే వారు చెప్పారని, ఇందులో రాజకీయ కక్షలు ఏమీ లేవని వివరించారని ఆర్‌డీఓ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అయితే తాను అధికారికంగా ఈ విచారణ చేయలేదని, వాస్తవం ఏమిటో తెలుసుకోవాలని యత్నించానన్నారు.

రాజీకి యత్నించిందెవరు?

బాధిత కుటుంబం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగానే కొందరు వారి వద్దకు వచ్చి, దాడి చేసిన వర్గం చికిత్స కోసం డబ్బులు ఇస్తుందని, బైండోవర్ కేసులు రాసుకొని రాజీ పడాలని కోరారు. దీనికి ధనలక్ష్మి కుటుంబం అంగీకరించలేదు. అక్కడ ఉంటే భయపెట్టి సంతకాలు చేయిస్తారని వెనక్కి వచ్చేశారు. అయితే ఈ రాజీ ప్రయత్నాలు చేసిందెవరు?, వారి వెనుక వైసీపీ నాయకులు ఉన్నారా?, లేదంటే అధికారులే అంతా కలిసి కేసుకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ఇలా చేస్తున్నారా?...అనేది తెలియడం లేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


రమణ (ఫైల్)

అనకాపల్లి, మే 23: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటన అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం జంక్షన్ వద్ద గురువారం జరిగింది. పాత గోపాలపట్నానికి చెందిన యల్లబిల్లి రమణ (35) డాక్‌యార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం కుంచంగిలో బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై కూండ్రం వెళ్ళి తిరిగి వస్తుండగా ఆర్‌వీపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

బాబోయ్... ఇదేం రోడ్డు

... 5వ పేజీ తరువాయి

ధూళి మేఘాలు రేగుతున్నాయి. చాలామంది ఊపిరాడక ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. దేవుడి దర్శనానికి వస్తే ఇవేమి ఇక్కట్లు అంటూ వాపోతున్నారు.

కాలువలూ పూర్తి చేయలేదు

రహదారిని వంద అడుగుల మేర విస్తరించేందుకు పనులు చేపట్టారు. ఇందుకోసం ఒకవైపు భవనాలను కొట్టేశారు. ఆ ప్రాంతంలో అంతా చిరు వ్యాపారాలు చేసుకునేవారే. ఇళ్ల ముందు కాలువ నిర్మాణానికి గోతులు తవ్వి, ఇనుప చువ్వలు వేసేశారు. ఆ పనులు పూర్తి చేయలేదు. దాంతో వారు ఇళ్లలోకి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇంటి ముందు దుకాణం పెట్టుకొని వ్యాపారాలు చేసుకునే వారికి ఆరు నెలల నుంచి ఉపాధి పోయింది. త్వరగా కాలువ నిర్మాణం పూర్తిచేస్తే ఇళ్లలోకి వెళ్లడానికి మెట్లు నిర్మించుకుంటామని, వ్యాపారాలు చేసుకుంటామని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దాదాపు రూ.33 కోట్లతో చేపట్టిన పనులు ఎందుకు త్వరగా పూర్తిచేయడం లేదని అక్కడివారు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కోసం పరీక్షలు రాస్తున్నారు.

అరగంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. కళాశాల ప్రిన్సిపాల్, ఇన్విజిలేటర్, సిబ్బంది, విద్యార్థుల వద్ద ఫోన్లు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాము. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన 0891-2552854, 0891-2567561 నంబర్‌లో సంప్రతించాలి.

- పి.మురళీధర్, ఆర్ఐవో

భారీగా విద్యుత్ వినియోగం

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. సాధారణంగా ఈ పనులు వర్షాలు పడే ముందు చేపడతారు. చెట్ల కొమ్మలను కొట్టడం వంటివి చేస్తారు. అయితే ఇప్పుడు విద్యుత్ లోడ్‌ను తగ్గించడానికి ప్రత్యామ్నాయ విధానంగా ఈ నిర్వహణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కో ఏరియాలో ఒక్కో రోజు ఆరు గంటలు విద్యుత్ నిలిపివేస్తే ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడానికి అధికారులు ఇలా చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. కారణాలేవైతేనేమి నగరంలో ప్రజలు కొన్ని గంటల పాటు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

విశాఖపట్నం సర్కిల్‌లో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందిస్తున్నాము. నిర్వహణ పనులు, మరమ్మతుల కోసమే అక్కడక్కడ కొద్దిసేపు ఆపుతున్నాము. అంతకు మించి అధికారికంగా ఎక్కడా విద్యుత్ సరఫరా ఆపడం లేదు. - మహేంద్రనాథ్, ఎస్.ఈ. విశాఖ సర్కిల్

పాఠశాలలకు పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఆయా పాఠశాలలు ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పాఠ్య పుస్తకాలు పంపుతున్నామన్నారు. కాగా ఈ ఏడాది 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు నేరుగా ఆయా మండలాల విద్యాశాఖాధికారుల కార్యాలయాలకు చేర్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలకు పంపిణీ చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.5.75 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా నిల్వలు

పెందుర్తి, మే 23: ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పెందుర్తి పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రెండుచోట్ల అక్రమంగా తయారు చేస్తున్న, నిల్వ ఉంచిన రూ.5.75 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. మేహాద్రిగెడ్డ రిజార్వాయర్ పరిధిలోని కంపరపాలెంలో గురువారం తనిఖీలు చేపట్టి రూ.ఐదు లక్షల విలువైన బాణసంచాతో పాటు తయరీదారుడు కొండవలస రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పాత పెందుర్తిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.75 వేల విలువైన బాణసంచాను స్వాధీనం చేసకుని శరగడం ఈశ్వరరావు, ఆడారి రమేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.



చందన కిరీటంతో గోవిందరాజస్వామి

అప్పన్న స్వామికి రెండో విడత చందన సమర్పణ

సింహాచలం, మే 23 : వరాహలక్ష్మీనృసింహస్వామికి రెండో విడత చందన సమర్పణ గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అంతరాలయంలో మూలవిరాట్‌కు తొలుత చందన సమర్పణ చేసి, శీతలోపచారాలు ఇచ్చిన తరువాత నీరాజనాలు సమర్పించారు. ఆస్థాన మండపంలో స్థానాచార్యుల పర్యవేక్షణలో ప్రధానార్చకులు సారథ్యంలో అర్చక బృందం ఉత్సవమూర్తికి విశేషంగా పంచామృతాలతో, పలు రకాల పండ్ల రసాలతో, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని చందన కిరీటంతో అలంకరించి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఈఈ డీజీ శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, మే 23: వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేయంతో పాటు పల్లకీసేవ నిర్వహించారు. వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక పుష్పాలతో వేదపండితులు అలంకరించి పూజలు జరిపారు. ఉదయం భక్తులకు స్వామివారి నేత్ర దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం పల్లకీలో శ్రీలక్ష్మి, పద్మావతి సమేత శ్రీవారిని అధిష్ఠింపజేసి పల్లకీ సేవ చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామివారి నిజపాద దర్శన భాగ్యాన్ని కల్పించారు.

పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

శ్రీనగర్, మే 23: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం శ్రీనగర్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలోని రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని పంచామృతాలతో అభిషేకించాక అర్చనలు, పూజలు చేశారు. సత్యనారాయణస్వామ సామూహిక వ్రతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అదేవిధంగా 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు ఆధ్వర్యంలో శ్రీవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

వేపగుంట: ఇక్కడి ముత్యాలమ్మ గుడిలో వైశాఖి పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. 150 మంది దంపతులు స్వామివారి వ్రతాల్లో పాల్గొన్నారు. దాతలు సమకూర్చిన పూజా సామగ్రిని భక్తులందరికీ ఉచితంగా అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఇంజక్షన్ నీడిల్స్ కొరత

సింధియా, మే 23: సింధియాలోని కార్మిక బీమా ఆస్పత్రిలో వైద్యానికి సంబంధించిన పలు సామగ్రి అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులకు సెలైన్ ఎక్కించేందుకు ఐవీ సెట్లు, ఇంజక్షన్ నీడిల్స్ కూడా లేకపోవడంతో బయట మందుల షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ రోగికైనా ఐవీ సెట్లు, నీడిల్స్ అవసరమైతే అక్కడ పనిచేస్తున్న సిబ్బందే బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసి తెస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి ఐవీ సెట్లు, ఇంజక్షన్ నీడిల్స్ వంటి వాటిని ఆస్పత్రిలో అందుబాటులో ఉంచేలా తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **రాజుయాదవ్ :** శ్రీకన్య, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **డర్టీ ఫెలో :** వెంకటేశ్వర-1, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **బాక్:** జగదాంబ, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్, దుర్గ, (మధురవాడ).
- **బిగ్‌బ్రదర్ :** శ్రీకాంతి
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద,
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 32, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 22, క్యారెట్ 36, దొండకాయలు 32, బంగాళదుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 170, బరబటి 50, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 94, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 133
ఫారం ధర	-- 153
విత్ స్కిన్	-- 276
స్కిన్‌లెస్	-- 286

విద్యుత్ చార్జీల విషయంలో వ్యత్యాసమేలా?

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు యూనిట్‌కు 50 పైసల నుంచి రూ.8కు, అధికారులకేమో యూనిట్‌కు రూ.6.40 పైసలు పెంచుతారా..

తక్షణమే విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఆందోళనలకు దిగుతాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, మే 23: విద్యుత్ చార్జీల విషయంలో తక్కువ జీతం తీసుకుంటున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులకు యూనిట్‌కు 50 పైసలు ఉన్న ధరను ఎనిమిది రూపాయలకు పెంచి, అధికారులకేమో రూ.6.40 పైసలు చేయడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,197వ రోజుకు చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల విషయంలో ఉక్కు యాజమాన్యం ద్వంద్వ వైఖరికి పాల్పడడం శోచనీయమన్నారు. 2017 నుంచి నూతన వేతనాలను అమలు చేయకుండా, కార్మికులకు రావాల్సిన ఇన్సెంటివ్‌లు, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్లు ఇవ్వకుండా, ఉద్యోగులు దాచుకున్న థ్రిఫ్ట్ సొసైటీ సొమ్ముపై యాజమాన్యం పెత్తనం చెలాయిస్తూ వేధింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు. కర్మాగారంలో ఉక్కు ఉత్పత్తులను తగ్గిస్తున్న యాజమాన్యం దుర్మార్గపు ఆలోచనలను ఖండిస్తున్నామన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే వారు కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు నిర్వాసిత ఉద్యోగులకు, ఆర్-కార్డుదారులుందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకుడు డీసీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయాలకు పెడుతున్న కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మౌనం వల్లే ఉక్కుకు ఈ దుస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసనాయుడు, వెంకటరావు, రమణమూర్తి, వెంకయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

▸▸ **రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వివరించిన కలెక్టర్**



వీడియా కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మే 23: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎం.మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో ఫలితాలు వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని, 176 సీసీ కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్‌కు అనుసంధానం చేసి, ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కౌంటింగ్‌కు సంబంధించి ఏయూలో ఏడు హాళ్లు గుర్తించామని, 98టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లను నియమించామన్నారు. పార్లమెంట్ పరిధిలోని పోస్టల్‌బ్యాలెట్‌ల లెక్కింపు ప్రక్రియ మూడు రౌండ్‌లలో నిర్వహించనున్నామని, ఇందుకు రెండు హాళ్ల గుర్తించామని, 18 టేబుళ్ల కేటాయించామన్నారు. అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ఐదు హాళ్లలో 33 టేబుల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్ణీత సమయంలోనే శిక్షణ ఇస్తామని ఈనెల 25న తొలివిడ ర్యాండమైజేషన్, జూన్ 2న రెండో విడత ర్యాండ్ మైజేషన్ ప్రక్రియ పూర్తిచేస్తామని వివరించారు.

హైస్కూల్ ప్లస్‌లో అరకొరగా ఇంటర్ అడ్మిషన్లు

సీట్ల భర్తీకి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు



గాజువాకలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్

గాజువాక, మే 23: ఇక్కడి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ అడ్మిషన్లు అరకొరగా సాగుతున్నాయి. దీంతో అధ్యాపకులు ఇంటర్ అడ్మిషన్ల కోసం తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటివరకు గాజువాక హైస్కూల్ ప్లస్‌లో బైపీసీలో 12 మంది, ఎంపీసీ కోర్సులో పది మంది విద్యార్థులు చేరారు. అలాగే గంగవరం హైస్కూల్ ప్లస్‌లో బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో 21 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ స్కూళ్లలో నలభై చొప్పున ఎంపీసీ, బైపీసీ కోర్సులకు సీట్లు మాత్రమే ఉన్నాయి. కేవలం విద్యార్థినులకు మాత్రమే ఈ సీట్లను కేటాయించడంతో భర్తీ ప్రక్రియ కొంతమేర ఇబ్బందికరంగా మారింది. ఆయా పాఠశాలల్లో ఇంటర్ కోర్సులను ప్రవేశపెట్టి రెండేళ్లవుతున్నప్పటికీ అడ్మిషన్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. గత ఏడాది కూడా ఆశించిన మేర సీట్ల భర్తీ కాకపోవడంతో పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇంటర్‌లో చేర్పించారు. ఇదిలావుండగా ఈ ఏడాది దాదాపు అన్ని సీట్లను భర్తీ చేసేందుకు సంబంధిత అధ్యాపకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తమ హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థులను చేర్పించాలని కోరుతున్నారు. గాజువాక హైస్కూల్‌లో పదో తరగతిలో 292 మంది విద్యార్థులవ్వగా, వీరిలో 143 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరిలో నిర్దేశిత సంఖ్యలో విద్యార్థినులు హైస్కూల్ ప్లస్‌లో చేరితే అడ్మిషన్లు శత శాతం జరిగే అవకాశం ఉంది. అలాగే గంగవరం హైస్కూల్‌లో 43 మంది విద్యార్థినులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థికి ఇంటికి అధ్యాపకులు వెళ్లి హైస్కూల్ ప్లస్‌లో చేరాలని కోరుతున్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



అంతర సౌందర్యం పుస్తకాన్ని ఆవిష్కరించిన దృశ్యం

పెందుర్తి-రూరల్, మే 23: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బ్రహ్మర్షి పిరమిడ్ శక్తి క్షేత్రంలో గురువారం బుధవారం బుద్ధ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ పి.చంద్రశేఖర్ (బెంగళూరు) ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఆధ్యాత్మిక అనుభవాలతో పాటు బుద్ధ పౌర్ణమి విశిష్టతను వివరించారు. అనంతరం సామూహిక ధ్యానం చేశారు. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక రచయిత రమణి రచించిన అంతర సౌందర్యం పుస్తకాన్ని పిరమిడ్ మాస్టర్లు ఆవిష్కరించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. సీనియర్ పిరమిడ్ మాస్టర్లు వాణి, జ్యోతి, శ్రీదేవి, వర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్కాపురం: గౌతమ బుద్ధుని బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరిస్తూ ముందుకు సాగితే మానవ జీవితం ఎంతో సుఖమయంగా ఉంటుందని బౌద్ధీయులు కాకర పోలారావు, బీసీ నాయకులు ఎన్.అప్పారావు పేర్కొన్నారు. మల్కాపురం ఎస్సీ కాలనీలో గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకుని రామ్-రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుద్ధుని విగ్రహం పువ్వులు పెట్టి కొవ్వత్తులు వెలిగించారు. అనంతరం అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు పి.భూలోకరాజు, సంఘం మాజీ అధ్యక్షుడు ముప్పిడి వెంకటగిరి, పెద్దలు పి.చిన్నదాలయ్య, పి.నాగరాజు, నూకరాజు, సియాద్రి చిన్నారావు, శ్రీను, కాకర రాజుతో తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు

గాజువాక, మే 23: గాజువాకలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డీసీపీ-2 ఎం.సత్తిబాబు ఆధ్వర్యంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ పర్యవేక్షణలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు తనిఖీలను కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. రౌడీషీటర్ల కదలికలపై పటిష్ట నిఘా పెట్టామని, ఎక్కడైనా.. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ఎన్నికల నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పెదగంట్యాడ, మే 23: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయం ఆవరణలో గురువారం విద్యార్థులకు రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి శిక్షణ శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని రమణ పేర్కొన్నారు.

కథలు రాయడంపై శిక్షణ

పెందుర్తి, మే 23: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం కథలు చెప్పడం, వినడం, రాయడంపై తర్ఫీదు ఇచ్చారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణనివ్వడంతో పాటు కథల ప్రాధాన్యాన్ని వక్తలు వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ ఇచ్చి వారిని ప్రోత్సహించారు. గ్రంథాలయాధికారి సూర్యకళ, ఆడారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

మల్కాపురం, మే 23: దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని, వారిని విద్యావంతులను చేయాలని జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. బాలల అభ్యున్నతికి, సంక్షేమానికి అందరు కృషి చేయాలని కోరారు. వలస కూలీల పిల్లల పట్ల, అత్యంత వెనకబడిన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి కోసం వసతిగృహాలను విరివిగా నిర్మించాలన్నారు. అనంతరం గౌతమ బుద్ధుని చిత్రపటానికి గ్రంథాయలాధికారి అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, తదితరులు పూలమాలలు వేశారు.

'కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

ఉక్కుటౌన్‌షిప్, మే 23: ఉక్కు కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో గురువారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గతంలో చేసిన నిరవధిక సమ్మె సమయంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తగిన పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం భావ్యం కాదని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, బొడ్డ గోవింద్, పిట్టా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరు

కార్మిక సమస్యలు పరిష్కారానికి తమ యూనియన్ రాజీ లేని పోరాటాలు చేస్తుందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి అన్నారు. ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం మరిన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా కార్మిక సమస్యల పరిష్కారానికి తాము తొలి ప్రాధాన్యం ఇస్తామన్నారు. విధి నిర్వహణలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఉక్కు ఉత్పత్తిని మరింత పెంచేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, నాయకులు అమ్మోరు, కె.రమణ, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని డీవీఆర్ యూనియన్ అధ్యక్షుడు గల్లా శంకర్‌సాయిరాం కోరారు. పదోన్నతుల కోసం చాలామంది ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని, అందువల్ల యాజమాన్యం స్పందించి పదోన్నతులు కల్పించాలన్నారు.

పదవీ విరమణ చేసిన హెచ్‌పీసీఎల్ అధికారులకు సత్కారం

మల్కాపురం, మే 23: హెచ్‌పీసీఎల్ అభివృద్ధిలో తమవంతు సేవలందించిన అధికారులు ఎంతో అభినందనీయులని సంస్థ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసిన వి.రత్నరాజ్, వీఆర్ఎంపీ ఈడీ ఆర్.వీరభద్రరావు, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) జాన్ చర్యన్ గురువారం పదవీ విరమణ చేయడంతో వారిని పిలకవానిపాలెంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం సన్మానగ్రహీతలు మాట్లాడుతూ ఈ సత్కారం తమకెంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ తమ పనిచేసే సంస్థ బాగుండాలని కోరుకోవాలని, అప్పుడే అందరూ బాగుంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మజ్జి సోమేశ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఎం.అప్పారావు, భోగవిల్లి నాగేశ్వరరావు, శ్రీకాంత్, కె.పోలిరెడ్డి, విజయ్‌కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్‌కు రూ.20 వేల విరాళం

అగనంపూడి, మే 23: జీవీఎంసీ 85వ వార్డు జనసేన నాయకురాలు గొన్నా రమాదేవి స్థానిక గొన్నవానిపాలెంలోని బొర్రమాంబ యూత్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ నిమిత్తం రూ.20 వేల విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. గ్రామంలో ఆట స్థలం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం యూత్ సభ్యులు రమాదేవిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు గణేశ్, బొర్రయ్యనాయుడు, జగన్, మదన్, కుమార్, కిరణ్, నూకరాజు, శివ, సోమేశ్, కార్తీక్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ఏటీఎం నుంచి రూ.75 వేలు చోరీ

కూర్మన్నపాలెం, మే 23: అగనంపూడి యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఉక్కు ఉద్యోగి ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలను ఓ వ్యక్తి చోరీ చేశాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదమడకలో నివాసముంటున్న ఉక్కు ఉద్యోగి ఎన్‌బీ నాయక్ బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు అగనంపూడి యాక్సిస్ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లి తొలుత రూ.ఐదు వేలు డ్రా చేశారు. ఆ తర్వాత మళ్లీ రూ.మూడు వేలు తీసేందుకు యత్నించగా డబ్బులు రాలేదు. ఆ సమయంలో వెనక ఉన్న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి తాను ట్రై చేస్తానని చెప్పి నాయక్ ఏటీఎం కార్డు తీసుకుని చాకచాక్యంగా దానిని మార్చేశాడు. అనంతరం ఏటీఎం నుంచి డబ్బులు రావడం లేదని ఆ వ్యక్తి చెప్పడంతో నాయక్ కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. కాగా గురువారం ఏ-షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన నాయక్ బుధవారం రాత్రి రూ.25 వేలు, గురువారం ఉదయం మరో రూ.50 వేలు డ్రా చేసినట్టు మెసేజ్‌లు ఫోన్‌లో ఉండడంతో తన సహచర మిత్రుడు శ్రీనివాస్‌కు ఈ విషయాన్ని చెప్పి ఏటీఎం కార్డును బ్లాక్ చేయించారు. అనంతరం ఆయన దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ఏటీఎంల వద్ద ప్రజలందరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలని, నగదు డ్రా చేసే విషయంలో ఎవరి సహకారం తీసుకోవద్దని సూచించారు.

ల్యాప్‌టాప్‌ల దొంగ అరెస్టు

విశాఖపట్నం, మే 23 : తమిళనాడు నుంచి వచ్చి, ఇక్కడ దొంగతనాలు చేసి వెళ్లిపోవడం, మళ్లీ రావడం ఇలా పలు మార్లు చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగలను ఎంవీపీ క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా జోన్ క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. తమిళనాడులోని వెల్లూరు జిల్లాకు చెందిన గణేష్ శంకర్ (29), వి.మంజునాథన్ (29) మరో వ్యక్తి 2021 నుంచి నగరంలో నేరాలు చేస్తున్నారు. ఎంవీపీ కాలనీతో పాటు భీమిలి, ఆనందపురం తదితర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడ్డారు. చోరీ సొత్తును విక్రయించి, ఆ సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈనెల 21న ఉదయం ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో శ్రీలక్ష్మీ నిలయం అపార్టుమెంట్ మొదటి అంతస్తులో పట్టపగలు చోరీ జరిగింది. యజమాని ఫణికిరణ్ వర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా వెంకోజీపాలెం కూడలి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పలు నేరాలకు పాల్పడి నట్టు అంగీకరించారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన ఎస్ఐ జగదీష్, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు అప్పలరాజు, రవికుమార్, అగస్టిన్, జగత్ కిరణ్, సాయిలను సీఐ అభినందించారు.

మేడ పైనుంచి జారి పడి ఒకరి మృతి

తగరపువలస, మే 23 : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో తన ఇంటి మేడ పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన చిల్ల అప్పలరాజు (55) గురువారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలు ప్రకారం.. వ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్న అప్పలరాజు బుధవారం రాత్రి మద్యం మత్తులో మేడ మీద నుంచి కిందకు ఉమ్మి వేసే ప్రయత్నంలో జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు సమీపంలో ఉన్న సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. గురువారం ఉదయం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో షార్ట్ సర్క్యూట్

గాజువాక, మే 21: గాజువాక పంతులుగారి మేడ వద్ద గల ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. పూర్తి స్థాయిలో పరిశీలించాక ఆస్తి నష్టం స్పష్టంగా తెలుస్తుందని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా



ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై బోల్తా పడిన లారీ

మర్రిపాలెం, మే 23: నగరం నుంచి గాజువాక వైపు పేపర్ బండిల్స్ లోడుతో వెళ్తున్న లారీ ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై రోటరీ డివైడర్ రైలింగ్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ క్లీనర్ గాయాలతో బయటపడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఒడిశాలోని బాలాసోర్ నుంచి విశాఖ ఆటోనగర్‌కు పేపర్ బండిల్స్ లోడుతో వస్తున్న లారీ ఎన్ఏడీ ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ క్షేమంగా బయటపడగా క్లీనర్ బిట్టుదాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. నైట్ రౌండ్స్‌లో ఉన్న సీఐ చక్రధరరావు ఘటనా స్థలానికి చేరుకుని క్లీనర్‌ను 108లో ఆస్పత్రికి తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ బాలరాజు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. లారీలో ఉన్న పేపర్ బండిల్స్‌ను క్రేన్ సాయంతో మరో లారీలో తరలించారు. లారీని తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, మే 23: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేశ్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ఏరియా, లక్ష్మీనగర్, రామకృష్ణానగర్, కొత్తపాలెం, సంతోష్‌నగర్, నాగేంద్ర కాలనీ, సూర్యనగర్, డీఏఆర్‌నగర్, గణపతి నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మల్కాపురం: మల్కాపురం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం ఎనిమది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు జోన్-2 ఈడీ బీకె నాయుడు తెలిపారు. ఈ కారణంగా ప్రకాశనగర్, వెంకన్నపాలెం, ఏడుగుళ్ల రోడ్డు, కృష్ణాబార్ లైన్, ఎస్సీ కాలనీ, మార్కెట్ వీధి, జాలరివీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

వేపగుంట: చీమలాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు చీమలాపల్లి, లక్ష్మీపురం, గవరపాలెం, చింతలగ్రహారం, పెదగాడి, చినగాడి, రాంపురం జంక్షన్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గుర్తించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి శంకర్‌కు పలువురి పరామర్శ

మద్దిలపాలెం, మే 23: విశాఖ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి దేవర శంకర్‌పై 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అనుచరులు దాడి చేసిన నేపథ్యంలో రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా లీగల్ సెల్ నాయకులు గురువారం ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి చేయించిన మూర్తియాదవ్‌ను పోలీసులు కేసు నుంచి తప్పించి, అతని అనుచరులపై సాధారణమైన 324 సెక్షన్ నమోదు చేయడాన్ని ఖండించారు. పట్టపగలు ఎంపీ అభ్యర్థి ఇంటికి వెళ్లి దాడి చేయడాన్ని జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్ సీరియస్‌గా తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూర్తి యాదవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వారు వెల్లడించారు.


ఉక్కు శివాలయ కమిటీ ప్రతినిధులకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, మే 23: స్టీల్‌ప్లాంట్‌లోని పురాతన శివాలయంలో గత 30 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉక్కు ఉద్యోగులు, కమిటీ ప్రతినిధులు మాటూరి తిరుపతిరావు, దుర్గాప్రసాద్‌లను బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంటులో ఉద్యోగం చేస్తూనే ఆలయ అభివృద్ధికి చేస్తున్న వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భద్రునాయక్, యెల్లేటి శ్రీనివాసరావు, శివరామకృష్ణ, సుధాకర్, మోహన్‌రావు, నాగభూషణం, రమణ, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.












బస్సుల కోసం చలివేంద్రం పందిరిలో వేచి ఉన్న ప్రయాణికులు


కళింగనగర్ వద్ద బస్టాపు స్థలంలో నిర్వహిస్తున్న కూరగాయల దుకాణం

రోడ్డు విస్తరణతో సరి..బస్ షెల్టర్ల నిర్మాణమేదీ?

- ఉత్తర నియోజకవర్గంలో దుస్థితి
- 48ఏ సిటీ బస్సు రూట్‌లో అవస్థలు
- కళింగనగర్‌లో షెల్టర్ స్థలం ఆక్రమణ

మాధవధార, మే 22: గత ఐదేళ్లలో విశాఖ ఉత్తర నియోజకవర్గాన్ని ఎన్నో విధాలుగా అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న పాలకుల ప్రకటనలకు, వాస్తవానికి పొంతన కుదరడం లేదు. రూ.కోట్లతో ఇటీవల నవీకరించిన మాధవధార, కైలాసపురం, సీతమ్మధార ప్రాంతాలకు చెందిన రహదారిలో 48ఏ సిటీ బస్సు నడుస్తోంది. రోజులో కొన్ని ట్రిప్పులు మాధవధార ఉడాకాలనీ నుంచి మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, మధుసూదన్ నగర్ ప్రాంతాల నుంచి పోర్టు హాస్పిటల్ మీదుగా అక్కయ్యపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సునుంచి వన్‌టౌన్ పాతపోస్టాఫీసు చేరుతోంది. అయితే, ఈ ఒక్క బస్సు కోసం కొత్తగా షెల్టర్లు కట్టడం ఎందుకు అనుకున్నారో ఏమో వైసీపీ పాలకులు. ఉన్న వాటితోనే రోడ్డు విస్తరణ పనులు కానిచ్చేశారు. ఈ క్రమంలో మాధవధార, మురళీనగర్, ప్రధానంగా కళింగనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీల్లో పాతవే కొనసాగుతున్నాయి.. కొత్తగా ఒక్క షెల్టరూ నిర్మించలేదు. దిగువ హైవే రోడ్డులో, బీఆర్‌టీఎస్ రోడ్డులో బస్సులు ఆగనిచోట షెల్టర్లు నిర్మించారు. ఎంపీల్యాడ్స్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ నిధులతో చాలాచోట్ల ఈ విధంగా ఏర్పాటుచేసిన బస్టాప్‌లు వృథాగా దర్శనమిస్తున్నాయి.

మాధధార 48ఏ బస్సు రూట్‌లో మాత్రం బస్సులు ఆగే చోట షెల్టర్లు నిర్మించలేదు. ఇందుకు సంబంధించి స్థలాలు కూడా దుకాణదారుల ఆక్రమణలకు లోనవుతున్నాయి. కళింగనగర్ బస్టాపులో ప్రయాణికులు వేచి చూసే చోట గతంలో ఉన్న చెట్టును రోడ్డు నిర్మాణం పేరిట తొలగించారు. చదును చేసిన ఈ స్థలంలో ప్రజా ప్రతినిధుల మద్దతుతో కూరగాయల దుకాణం వెలిసింది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు చలివేంద్రంపాకలో, రోడ్డు అవతల నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 23: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. కైలాసపురం ప్రధానరహదారి, కస్తూరినగర్, దుర్గా కైలాసనగర్, నరసింహనగర్, రైతుబజారు, విద్యుత్ నగర్, కిరణ్ పార్కు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఐవోపీఎల్‌లో పర్యావరణ హిత ఇంధనం

మహారాణిపేట, మే 23: పర్యావరణానికి మేలు చేసేలా నాణ్యమైన ఉత్పత్తులను అందించగల సామర్థ్యాన్ని ఇండియన్ ఆయిల్ సాధించిందని సంస్థ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ తెలిపారు. మహారాణిపేటలోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టయిల్‌పైప్ ఉద్గారాలతో పర్యావరణానికి అనుకూలంగా ఆక్టేన్ పెట్రోల్‌ను అభివృద్ధి చేశామన్నారు.

నేడు నీటి సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మే 23: సీతమ్మధార టీడీపీ కాలనీలో 400 ఎంఎం ఎసి పంపింగ్ మెయిన్ పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తామని కార్యనిర్వాహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, రాధాకృష్ణ లేఅవుట్, 16వ వార్డులో కేఆర్‌ఎం కాలనీ, భానునగర్, 24వ వార్డులో టీడీపీ కాలనీ, పిఅండ్‌టి కాలనీల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

సంజీవని నిధికి హెచ్‌పీసీఎల్ ఉద్యోగుల విరాళం

మహారాణిపేట, మే 23: అనారోగ్యంతో బాధపడే పేదలకు సాయం చేసేందుకు వీలుగా నెలకొల్పిన సంజీవని నిధి, డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు రూ.6,45,000 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని సంజీవని నిధి బ్యాంకు ఖాతాలో జమ చేసి, ఆ పత్రాలను హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్ గురువారం కలెక్టర్ ఎ.మల్లికార్జునకు అందజేశారు. హెచ్‌పీసీఎల్ ఉద్యోగులు చూపిన చొరవకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం



జగదాంబ కూడలి, మే 23: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేకం సేవలను నిర్వహించారు. ఉదయం 8గంటలకు అర్చకులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


బుద్ధుని విగ్రహం వద్ద వాకర్స్ క్లబ్ సభ్యులు

మాధవధార, మే 23: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో గురువారం వైశాఖ పౌర్ణమి (బుద్ధ పౌర్ణమి) ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సభ్యులు, కార్యవర్గం బుద్ధునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధుని బోధనల్లో సామాజిక శాంతి కోణం, విశిష్టతలను వివరించారు. ధ్యానాన్ని నేటి తరం అలవాటుగా చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్.సత్యనాథం, సి.హెచ్.ప్రసాదరావు, జి.విజయలక్ష్మి, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైశాఖీ స్పోర్ట్సు పార్కులోని బుద్ధుని విగ్రహం వద్ద పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ బుద్ధునికి పూలమాలలతో నివాళులర్పించారు.

బౌద్ధాలయంలో పౌర్ణమి పూజలు

కంచరపాలెం: అశోక్‌నగర్ ఆంధ్ర బౌద్ధ సమాజంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దల ఆత్మశాంతి కోసం పూజలు జరిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. వెంకటరావు, భీమారావు, రాము, సునీల్, పరిమళ, హాసిని, దీక్షి, దర్శిత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహోన్నతం

అక్కయ్యపాలెం: అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. వైశాఖీ పౌర్ణమి సందర్భంగా గురువారం మధ్యాహ్నం రైల్వేన్యూకాలనీలోని ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని సీతారాం, ధనలక్ష్మి దంపతులు ప్రారంభించారు. అంతకు ముందు వారు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో నిబంధనలు పాటించాలి: ఆర్డీవో


అభ్యర్థులు, ఏజెంట్లతో మాట్లాడుతున్న ఆర్డీవో

జ్ఞానాపురం, మే 23: వచ్చే నెల నాలుగో తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపులో పోటీలోని అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను పాటించాలని పశ్చిమ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ సూచించారు. ఈ మేరకు గురువారం జ్ఞానాపురంలోని కార్యాలయంలో అభ్యర్థులు, ఏజెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహించే విధానాన్ని వివరించారు. సమావేశంలో జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, గోపాలపట్నం తహసీల్దార్ పి.విజయభాస్కర్, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో 16 మందికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, మే 23: రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ, అక్కడే తిష్ట వేసుకుని ఉంటున్న 16 మంది నిరాశ్రయులను టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్, వసతి గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు. రైల్వేస్టేషన్‌లో చేసిన రెస్క్యూ ఆపరేషన్‌లో గుర్తించినవారిలో 13 మంది పురుషులు, ముగ్గురు మహిళలున్నారని, వీరిలో కొంతమంది బయటకు వెళ్లిపోతామని గొడవ చేస్తున్నారన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి భిక్షాటనకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.


సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు


ఇసుక కొండ సత్యనారాయణస్వామి

సత్యనారాయణస్వామి ఆలయంలో ఘనంగా వైశాఖ పౌర్ణమి

మహారాణిపేట, మే 23: ఇసుక కొండ శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి మహోత్సవ పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్ సమీపంలోని ఇసుక కొండగా పిలిచే బాబాజీ కొండపై వెలసిన ఆలయానికి భక్తులు పోటెత్తారు. ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఫణిహారంనరసింహాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తురాలు హేమలత ఆధ్వర్యంలో మహాలక్ష్మి, విష్ణు సంకీర్తనలు ఆలపించా. కోలాటం ఆడారు. ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ భక్తులకు తాగునీటితోపాటు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్, మే 23: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 101 జయంత్యుత్సవాల సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. హిందుస్థాన్ జింక్ మైదానంలో నార్త్ నియోజకవర్గానికి చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్న టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈనెల 28న ఎన్టీఆర్ జయంతి రోజున విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ 51వ వార్డు నేతలు జయరాజ్ (జాన్), పి.మణికంఠ, బుజ్జి, శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు ఐదు బ్యాటరీ వాహనాలు

- సమకూర్చిన విశాఖ స్టీల్‌ప్లాంట్
- ప్రారంభించిన కలెక్టర్ మల్లికార్జున


బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించి, నడపుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట, మే 23: కేజీహెచ్‌లో రోగులకు రవాణా సేవలు అందించేందుకు వీలుగా ఐదు బ్యాటరీ కార్లను ఆర్ఐఎన్ఎల్ (విశాఖ స్టీల్‌ప్లాంట్) అంతజేసింది. వీటిని గురువారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్ సీఈఆర్ (కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ రెస్పాన్స్‌బులిటీ ఇనీషియేటివ్) సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా సుమారు రూ.40 లక్షల విలువ చేసే బ్యాటరీతో నడిచే ఐదు వాహనాలను కేజీహెచ్‌కు అందించింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చి, నడవలేని వారు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు, కొండ మీద ఉన్న సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌కు వెళ్లాల్సిన రోగులు, వైద్య పరీక్షలు చేయించుకునేందుకు ఓపీ నుంచి డయాగ్నొస్టిక్ సెంటర్‌కు వెళ్లేందుకు, ఇన్‌పేషెంట్లను తరలించేందుకు ఉచితంగా వినియోగిస్తారు. వాహనాలను ప్రారంభించిన అనంతరం కలెక్టర్ దానిని నడిపిన అనంతరం మాట్లాడుతూ విశాఖ ఉక్కు సమాజ శ్రేయస్సు కోసం ప్రజలకు ఉపయోగపడే సేవలందిస్తోందన్నారు. ఈ వాహనాలు రోగులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఆస్పత్రిలో ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అదనపు డైరెక్టర్ ఏకే బాగ్చి, సీజీఎం ప్రవీణ్‌కుమార్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్మా క్యాంపు ఘటనపై రెవెన్యూ విచారణ

- వ్యక్తిగత కక్షలని ఏకపక్షంగా నిర్ధారణ
- అధికారిక విచారణ కాదని మరోవైపు వివరణ

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): బర్మా క్యాంపులో వారం క్రితం జరిగిన దాడి ఘటనపై తీరుబడిగా రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. అది కూడా అనధికారికంగానే కావడం గమనార్హం. కూటమి సానుభూతిపరులైన సుంకరి ధనలక్ష్మి కుటుంబంపై వైసీపీకి చెందిన ఒక వర్గం దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. పది మందిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేస్తే ఒక్కరినే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. పైగా ఇది వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన ఘటన అని, దీనికి రాజకీయ పార్టీలకు సంబంధం లేదని కంచరపాలెం పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టి మరీ వెల్లడించారు. అయితే, వైసీపీకి ఓట్లు వేయడానికి డబ్బులు ఇస్తామన్నారని, తాము నిరాకరించి, కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసినందుకే కక్ష గట్టి దాడి చేశారని ధనలక్ష్మి కుటుంబం ఆరోపిస్తోంది. ఈ వివాదం చినికి చినికి గాలివానగా మారడంతో ఎన్నికల సంఘం ఎక్కడ దీనిపై విచారణకు ఆదేశిస్తుందనే భయంతో అధికార వర్గాలు ఈ కేసును రాజీ చేయడానికి యత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా బాధిత కుటుంబాన్ని జాయింట్ కలెక్టర్ రమ్మంటున్నారంటూ బుధవారం సచివాలయ సిబ్బంది ఫోన్ చేసి గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. అదే సమయానికి దాడి చేసిన పది మందినీ అక్కడికి రప్పించారు. ఇరువర్గాలను పిలిచి రాజీ చేయాలనుకున్నారేమో...దానికి అంగీకరించకుండా ధనలక్ష్మి కుటుంబం వెనక్కి వచ్చేసింది.

ఆర్‌డీఓ విచారణ

గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం తన పరిధిలోకి వస్తున్నందున ఈ ఘటనలో ఏమి జరిగిందో తెలుసుకోవడానికి ఇరువర్గాలను పిలిపించామని ఆర్‌డీఓ తెలిపారు. అయితే బాధిత వర్గం బయట నుంచే వెళ్లిపోయిందని, దాడి చేసిన వర్గం వారితో మాట్లాడి ఏమి జరిగిందో తెలుసుకున్నామన్నారు. ఇది వ్యక్తిగత కక్షలతో చేసిన దాడిగానే వారు చెప్పారని, ఇందులో రాజకీయ కక్షలు ఏమీ లేవని వివరించారని ఆర్‌డీఓ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అయితే తాను అధికారికంగా ఈ విచారణ చేయలేదని, వాస్తవం ఏమిటో తెలుసుకోవాలని యత్నించానన్నారు.

రాజీకి యత్నించిందెవరు?

బాధిత కుటుంబం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగానే కొందరు వారి వద్దకు వచ్చి, దాడి చేసిన వర్గం చికిత్స కోసం డబ్బులు ఇస్తుందని, బైండోవర్ కేసులు రాసుకొని రాజీ పడాలని కోరారు. దీనికి ధనలక్ష్మి కుటుంబం అంగీకరించలేదు. అక్కడ ఉంటే భయపెట్టి సంతకాలు చేయిస్తారని వెనక్కి వచ్చేశారు. అయితే ఈ రాజీ ప్రయత్నాలు చేసిందెవరు?, వారి వెనుక వైసీపీ నాయకులు ఉన్నారా?, లేదంటే అధికారులే అంతా కలిసి కేసుకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ఇలా చేస్తున్నారా?...అనేది తెలియడం లేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


రమణ (ఫైల్)

అనకాపల్లి, మే 23: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ సంఘటన అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం జంక్షన్ వద్ద గురువారం జరిగింది. పాత గోపాలపట్నానికి చెందిన యల్లబిల్లి రమణ (35) డాక్‌యార్డులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం కుంచంగిలో బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై కూండ్రం వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్‌వీపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

బాబోయ్... ఇదేం రోడ్డు

... 5వ పేజీ తరువాయి

ధూళి మేఘాలు రేగుతున్నాయి. చాలామంది ఊపిరాడక ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. దేవుడి దర్శనానికి వస్తే ఇవేమి ఇక్కట్లు అంటూ వాపోతున్నారు.

కాలువలూ పూర్తి చేయలేదు

రహదారిని వంద అడుగుల మేర విస్తరించేందుకు పనులు చేపట్టారు. ఇందుకోసం ఒకవైపు భవనాలను కొట్టేశారు. ఆ ప్రాంతంలో అంతా చిరు వ్యాపారాలు చేసుకునేవారే. ఇళ్ల ముందు కాలువ నిర్మాణానికి గోతులు తవ్వి, ఇనుప చువ్వలు వేసేశారు. ఆ పనులు పూర్తి చేయలేదు. దాంతో వారు ఇళ్లలోకి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇంటి ముందు దుకాణం పెట్టుకొని వ్యాపారాలు చేసుకునే వారికి ఆరు నెలల నుంచి ఉపాధి పోయింది. త్వరగా కాలువ నిర్మాణం పూర్తిచేస్తే ఇళ్లలోకి వెళ్లడానికి మెట్లు నిర్మించుకుంటామని, వ్యాపారాలు చేసుకుంటామని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దాదాపు రూ.33 కోట్లతో చేపట్టిన పనులు ఎందుకు త్వరగా పూర్తిచేయడం లేదని అక్కడివారు ప్రశ్నిస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

కోసం పరీక్షలు రాస్తున్నారు.

అరగంట ముందే చేరుకోవాలి

విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి. సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. కళాశాల ప్రిన్సిపాల్, ఇన్విజిలేటర్, సిబ్బంది, విద్యార్థుల వద్ద ఫోన్లు ఉంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటాము. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చిన 0891-2552854, 0891-2567561 నంబర్‌లో సంప్రతించాలి.

- పి.మురళీధర్, ఆర్‌ఐవో

భారీగా విద్యుత్ వినియోగం

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. సాధారణంగా ఈ పనులు వర్షాలు పడే ముందు చేపడతారు. చెట్ల కొమ్మలను కొట్టడం వంటివి చేస్తారు. అయితే ఇప్పుడు విద్యుత్ లోడ్‌ను తగ్గించడానికి ప్రత్యామ్నాయ విధానంగా ఈ నిర్వహణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కో ఏరియాలో ఒక్కో రోజు ఆరు గంటలు విద్యుత్ నిలిపివేస్తే ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడానికి అధికారులు ఇలా చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. కారణాలేవైతేనేమి నగరంలో ప్రజలు కొన్ని గంటల పాటు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

విశాఖపట్నం సర్కిల్‌లో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందిస్తున్నాము. నిర్వహణ పనులు, మరమ్మతుల కోసమే అక్కడక్కడ కొద్దిసేపు ఆపుతున్నాము. అంతకు మించి అధికారికంగా ఎక్కడా విద్యుత్ సరఫరా ఆపడం లేదు. - మహేంద్రనాథ్, ఎస్.ఈ. విశాఖ సర్కిల్

పాఠశాలలకు పుస్తకాలు

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఆయా పాఠశాలలు ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పాఠ్య పుస్తకాలు పంపుతున్నామన్నారు. కాగా ఈ ఏడాది 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు నేరుగా ఆయా మండలాల విద్యాశాఖాధికారుల కార్యాలయాలకు చేర్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలకు పంపిణీ చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.5.75 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా నిల్వలు

పెందుర్తి, మే 23: ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పెందుర్తి పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రెండుచోట్ల అక్రమంగా తయారు చేస్తున్న, నిల్వ ఉంచిన రూ.5.75 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నారు. మేహాద్రిగెడ్డ రిజార్వాయర్ పరిధిలోని కంపరపాలెంలో గురువారం తనిఖీలు చేపట్టి రూ.ఐదు లక్షల విలువైన బాణసంచాతో పాటు తయారీదారుడు కొండవలస రమేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పాత పెందుర్తిలో అక్రమంగా నిల్వ చేసిన రూ.75 వేల విలువైన బాణసంచాను స్వాధీనం చేసకుని శరగడం ఈశ్వరరావు, ఆడారి రమేశ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, మే 23 : పీఎంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సప్తగిరి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.సుందర్‌నగర్, తారకరామనగర్, బింద్రానగర్, సప్తగిరి కాలనీ, లా కళాశాల రోడ్డు, చాణిక్యపురి లేఅవుట్, పీర్‌లెస్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

ఆరిలోవ పరిధిలో...

ఆరిలోవ : విమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఆపరేషన్ విభాగం ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ కాలనీ, విశాలాక్షినగర్, సంజీవ్‌నగర్ కాలనీ, ఫారెస్ట్ రోడ్డు, ఎస్సీ ఎస్టీ కాలనీ, వెటర్నరీ లేఅవుట్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విశాలాక్షినగర్ : కైలాసగిరి తెలుగు మ్యూజియం, చలపతినగర్ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. విశాలాక్షినగర్ రెవెన్యూ కాలనీ, పోలీసు క్వార్టర్స్, దయాల్ నగర్, జోడుగుళ్లపాలెం, ఎస్సీ ఎస్టీ కాలనీ, చలపతినగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈఓ

భీమునిపట్నం, మే 23 : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ ఎం.శివరాణి తెలిపారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 3వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తగరపువలసలోని చిట్టివలస హైస్కూల్‌ను కేంద్రాలుగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు అర్ధ గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

26 నుంచి ఎర్నిదుర్గమాంబ పండగ

ఆరిలోవ, మే 23 : తోటగరువు,పెదగదిలి గ్రామ దేవత ఎర్నిదుర్గమాంబ అమ్మవారి పండగ ఈనెల 26 నుంచి 28 వరకు జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 26న పండగ చాటింపు, 27న తోలేళ్ల ఉత్సవం, 28న ప్రధాన పండగ జరుగుతుందన్నారు. భక్తులు అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతి

పద్మనాభం, మే 23 : పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో సర్వే నెంబరు 317లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి పట్ల అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తూ, 25 ఏళ్లుగా అనుభవదారులుగా ఉంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వి.పరదేశి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన గురువారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా పాకలు వేసుకొని జీవనం సాగిస్తూ జగనన్న కాలనీలు రాకపోవడంతో ఇంటి నిర్మాణం చేపడితే తమ ఇంటిని అధికారులు కూల్చేశారన్నారు. తమతో పాటు కొత్తగా స్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తాము ఉంటున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

ముందస్తు వ్యాక్సిన్‌తో క్షయ నివారణ

సింహాచలం, మే 23 : క్షయ నివారణకు సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 98వ వార్డు పరిధిలో ఉన్న ఐదు సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు ముందస్తుగా బీసీజీ వాక్సినేషన్ ప్రారంభించినట్టు ఆసుపత్రి వైద్యాధికారి ప్రసాద్ నాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గురువారం రోజుకు కనీసం 700 మందికి వాక్సినేషన్ వేయనున్నట్టు చెప్పారు. 60 ఏళ్లు పైబడినవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ రోగులు, పొగతాగే అలవాటున్న వారు వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. గర్భిణిలు, బాలింతలు, క్షయ మందులు వాడుతున్న వారు, జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారు, కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులు ఉన్న వారు వ్యాక్సిన్ వేయించుకోరాదన్నారు. ప్రస్తుతం ప్రియా గార్డెన్స్, అడివివరం ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కొనసాగుతుందని తెలిపారు.

సినిమా గైడ్

- **రాజుయాదవ్ :** శ్రీకన్య, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **డర్టీ ఫెలో :** వెంకటేశ్వర-1, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం),
- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలిస్, దుర్గ, (మధురవాడ).
- **బిగ్‌బ్రదర్ :** శ్రీకాంతి
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద,
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 32, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారేట్ 36, దొండకాయలు 32, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 170, బరబటి 50, ముల్లంగి 34, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 94, పొటల్స్ 40, కీరదోస 26, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 30, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	133
ఫారం ధర	--	153
విత్ స్కిన్	--	276
స్కిన్‌లెస్	--	286

సింహగిరికి పోటెత్తిన భక్తులు

వైశాఖ పౌర్ణమి సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు

సింహాచలం, మే 23 : వరాహలక్ష్మీనృసింహస్వామిని వైశాఖ పౌర్ణమి సందర్భంగా భక్తులు గురువారం పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. బుధవారం రాత్రే ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల నుంచి మత్స్యకారులు కుటుంబాలతో సహ కొండ దిగువకు చేరుకున్నారు. వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి, కోలలు వెలిగించి అప్పన్నను కీర్తిస్తూ రాత్రంతా గడిపారు. ఆరుబయట వంటా వార్పు చేసుకుని కోలలకు నివేదనలు చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గురువారం సూర్యోదయానికి ముందే గరిడీ బృందాలుగా భజనలు చేసుకుంటూ సింహగిరికి చేరుకుని తలనీలాలు సమర్పించి గంగధారలో పవిత్ర స్నానాలు చేశారు. తరువాత ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని ముందుగానే ఊహించిన దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి పుష్కరిణి వద్ద గజ ఈతగాళ్లను మోహరించి, గోపాలపట్నం పోలీసుల సహకారంతో బందోబస్తు చేపట్టారు.



పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ



అభిషేకాలు చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్లో) చందన కిరీటంతో గోవిందుడు

అప్పన్నకు రెండో విడత చందన సమర్పణ

సింహాచలం, మే 23 : వరాహలక్ష్మీనృసింహస్వామికి రెండో విడత చందన సమర్పణ గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ అంతరాలయంలో మూలవిరాట్‌కు తొలుత చందన సమర్పణ చేసి, శీతలోపచారాలు ఇచ్చిన తరువాత నీరాజనాలు సమర్పించారు. ఆస్థాన మండపంలో స్థానాచార్యుల పర్యవేక్షణలో ప్రధానార్చకులు సారధ్యంలో అర్చక బృందం ఉత్సవమూర్తికి విశేషంగా పంచామృతాలతో, పలు రకాల పండ్ల రసాలతో, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని చందన కిరీటంతో అలంకరించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఈఈ డీజీ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

▸▸ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వివరించిన కలెక్టర్

విశాఖపట్నం, మే 23 : ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో ఫలితాలు వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, ఎంసీసీ నోడల్ అధికారి సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కేంద్ర బలగాలతో పాటు సుమారు 500 మంది సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని, 176 సీసీ కెమెరాలు అమర్చామని, వాటిని మానిటరింగ్ రూమ్‌కు అనుసంధానం చేసి, ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కౌంటింగ్‌కు సంబంధించి ఏయూలో ఏడు హాళ్లు గుర్తించామని, 98టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌లను నియమించామన్నారు. పార్లమెంట్ పరిధిలోని పోస్టల్‌బ్యాలెట్‌ల లెక్కింపు ప్రక్రియ మూడు రౌండ్‌లలో నిర్వహించనున్నామని, ఇందుకు రెండు హాళ్లు గుర్తించామని, 18 టేబుళ్లు కేటాయించామన్నారు. అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ఐదు హాళ్లలో 33 టేబుల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి నిర్ణీత సమయంలోనే శిక్షణ ఇస్తామని ఈనెల 25న తొలివిడ ర్యాండమైజేషన్, జూన్ 2న రెండో విడత ర్యాండ్ మైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున



వంశీకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

వంశీకృష్ణకు షిర్డీలో ఘన స్వాగతం

మద్దిలపాలెం, మే 23 : దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆయన అభిమానులు షిర్డీ విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం పలికారు. మహారాష్ట్ర సంప్రదాయ పద్ధతిలో సత్కరించి, సాయినాథుడి ఆలయం వరకు ర్యాలీగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు ఖాయం : గంటా నూకరాజు

భీమునిపట్నం, మే 23 : రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయ మని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. కూటమికి 120 నుంచి 130 సీట్లు గెలువనుందన్నారు. జూన్ 9న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు ఏమి కోల్పోయారో, వాటన్నింటిని తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. భీమిలి అసెంబ్లీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి మతుకుమిల్లి శ్రీభరత్ అఖండ మెజారిటీతో గెలుస్తారని, కార్యకర్తలు విజయోత్సవాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి శంకర్‌కు పలువురి పరామర్శ

మద్దిలపాలెం, మే 23 : విశాఖ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి దేవర శంకర్‌పై 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అనుచరులు దాడి చేసిన నేపథ్యంలో రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా లీగల్ సెల్ నాయకులు గురువారం ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి చేయించిన మూర్తియాదవ్‌ను పోలీసులు కేసు నుంచి తప్పించి, అతని అనుచరులపై సాధారణమైన 324 సెక్షన్ నమోదు చేయడాన్ని ఖండించారు. పట్టపగలు ఎంపీ అభ్యర్థి ఇంటికి వెళ్లి దాడి చేయడాన్ని జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్ సీరియస్‌గా తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మూర్తి యాదవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వారు వెల్లడించారు.

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై లారీ బోల్తా

మర్రిపాలెం, మే 23 : నగరం నుంచి గాజువాక వైపు పేపర్ బండిల్స్ లోడుతో వెళ్తున్న లారీ ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై రోటరీ డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ క్లీనర్ గాయాలతో బయటపడ్డాడు. ఒడిశాలోని బాలాసోర్ నుంచి ఆటోనగర్‌కు పేపర్ బండిల్స్ లోడుతో వస్తున్న లారీ ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై గురువారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ క్షేమంగా బయటపడగా క్లీనర్ బిట్టుదాస్‌కు స్వల్పగాయాలయ్యాయి. నైట్ రౌండ్స్‌లో ఉన్న సీఐ చక్రధరరావు ఘటనా స్థలానికి చేరుకుని క్లీనర్‌ను 108లో ఆస్పత్రికి తరలించారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ బాలరాజు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తం : ముత్తంశెట్టి

భీమునిపట్నం, మే 23 : ఓట్ల లెక్కింపు సమయంలో పార్టీ కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా వుండాలని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం రాత్రి ఆయన తన క్యాంప్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అత్యధిక స్థానాల్లో అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమని చెప్పారు.కానీ ప్రత్యర్థి వర్గం తప్పుడు సర్వేలతో తాము గెలువబోతున్నట్టు ప్రచారం చేసుకుంటున్నారని, వాళ్లు లెక్కింపు కేంద్రంలో తప్పుడు ప్రయత్నాలకు పాల్పడే అవకాశం ఉందని చెప్పారు. భీమిలిలో మళ్లీ తనదే గెలుపని, ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని చెప్పారు. ఈ సమావేశంలో వైసీపీ యువజన విభాగం జిల్లా కోఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ నందీశ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, భీమిలి,పద్మనాభం ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, పార్టీ నాయకులు మజ్జి వెంకటరావు, బోని బంగారునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, కదిరి ఎల్లాజి, జీరు వెంకటరెడ్డి, అక్కరమాని చినబాబు, గుండాసు మధు నాయుడు, సరగడ రఘునాథరెడ్డి, వాసుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

సాగరతీరంలో 'మై సూపర్ మామ్' రేపు

రామ్‌నగర్, మే 23 : సాగర తీరంలో శనివారం మై సూపర్ మామ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు వీరుమామ తెలిపారు. గురువారం ఆయన బీచ్ రోడ్డులోని ఒక సమావేశ మందిరంలో మై సూపర్ మామ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీచ్‌రోడ్డులోని మెరైన్ పార్కులో జరిగే ఈ కార్యక్రమంలో తల్లితో పాటు చిన్నారులకు ర్యాంప్ వాక్, మాంబో వంటి పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నామని, నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీరామ్ కుమార్, స్టార్ మౌనిక పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో పోలీసుల తనిఖీలు

ఎంవీపీ కాలనీ, మే 23 : ఎన్నికల ఫలితాలు నేపథ్యంలో ఎలాంటి హింస చెలరేగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు గురువారం రాత్రి శివాజీ పార్కును ఆనుకుని ఉన్న ఆదర్శనగర్‌లో తనిఖీలు చేపట్టారు. ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, కింది స్థాయి సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న అందరి గుర్తింపు కార్డులను పరిశీలించారు. అక్కడ ఉన్న వాహనాలను వాటి పత్రాలను తనిఖీ చేశారు. బయటి వ్యక్తులు ఎందుకు వచ్చారన్న వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ద్వారకా జోన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ వర్సిటీ వీసీ జానకీరామ్

వెంకోజీపాలెం, మే 23 : జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ అన్నారు. గురువారం ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ సంపద తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాలు పెరిగిపోవడం పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు సంఘటితంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తి ప్రకృతి ప్రేమికులుగా మారాల్సిన అవసరం ఉందని చెప్పారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర ప్రాణులపై కూడా ప్రభావం చూపుతున్నాయన్నారు.నేషనల్ బయోడైవర్సిటీ బోర్డు సభ్యుడు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక్క డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని చెప్పారు. ఏపీ బయో డైవర్సిటీ బోర్డు మెంబర్ సెక్రటరీ బీవీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావంగా జీడీపీ దెబ్బతింటుందన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే దాని ప్రభావం ప్రతి వ్యక్తిపై ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య కె. సంధ్య, దీపిక తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జానకీరామ్



గంటాను కలిసిన గరె గురునాథ్, తదితరులు

గంటాను కలిసిన ఆరో వార్డు టీడీపీ నాయకులు

కొమ్మాది, మే 23 : మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గం కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావును ఆరో వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంవీపీ కాలనీలోని గంటా నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం నుంచి గంటా భారీ మెజారిటీతో గెలవనున్నట్టు చెప్పారు. ఆయన హయాంలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధి జరగనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడికి అభినందనల వెల్లువ



వెలగపూడికి అభినందనలు తెలుపుతున్న 12 వార్డు నాయకులు

ఎంవీపీ కాలనీ/ఆరిలోవ, మే 23 : ఎన్నికల ఫలితాలు ఇంకా వెలువడకపోయినా, ప్రజల నాడి తెలుసుకుని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో విజయం మీదేనంటూ ఆయన క్యాంపు కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. గురువారం 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, వార్డు అధ్యక్షుడు గాడి సత్యం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వద్దకు వచ్చారు. ప్రజల నుంచి సానుకూల స్పందన ఉందని, ఎన్నికల్లో విజయం మనదేనంటూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒమ్మి పోలరావు, రాజు, ఏడువాక సన్యాసిరావు, బాలరాజు పాల్గొన్నారు. అలాగే పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలోనూ నాయకులు వెలగపూడిని కలిశారు.ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు. కార్యదర్శి కేతా సత్యన్నారాయణ. క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి తిరు కల్యాణం

భీమునిపట్నం, మే 23 : పట్టణంలోని ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయ షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీమాన్ ముప్పిరాల అనంతాచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకుడు శేషాచార్యులు, ఆయన శిష్యుల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శ నాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కేఎస్ఎన్ మూర్తి, కేవీ భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె. పద్మజ, కోశాధికారి వుశిరికల బంగార్రాజు, ఆర్ఆర్ ఇంజనీరింగ్ ఎండీ శ్రీనివాస్, వీటా మైనింగ్ ఎండీ విజయ్‌భాస్కర్, చందుభాయ్ పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

గెద్దపేటలో రాజ్యలక్ష్మి అమ్మవారి పండుగ

పద్మనాభం, మే 23 : కోరాడ పంచాయతీ గెద్దపేటలో రాజ్యలక్ష్మి అమ్మవారి అనుపోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువజామున అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామంలోని చదురు గుడి నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. ఊరేగింపులో భాగంగా కోలాటం, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఎగువపేటలో ఎంఈఓ పర్యటన

భీమునిపట్నం, మే 23 : భీమిలి ప్రాంతంలో ప్రత్యేకావసరాల పిల్లలను సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే భవిత కేంద్రాలకు పంపించాలని ఎంఈఓ-2 జయప్రద కోరారు. బుధవారం ఆమె ఎగువపేట, బోయవీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. బడి బయట వున్న పిల్లలను గుర్తించి, పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు, నమోదు కార్యక్రమం చేపట్టారు. 18 ఏళ్లలోపు వారిని సమీప పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించి, భవిత కేంద్రానికి పంపించాలని తెలిపారు.

ఘనంగా అన్నమాచార్యుల జయంత్యుత్సవం

పెదవాల్తేరు, మే 23 : తాళ్లపాక అన్నమాచార్యుల 616 జయంత్యుత్సవం పురస్కరించుకుని శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు నాగలక్ష్మి, లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బీచ్ రోడ్డులో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి సంకీర్తనలతో పాటు మహిళలు కోలాటం ఆడారు. అనంతరం ర్యాలీగా అన్నమయ్య విగ్రహం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు.

ల్యాప్‌టాప్ దొంగలు అరెస్టు

ఎంవీపీ కాలనీ, మే 23 : తమిళనాడు నుంచి వచ్చి, ఇక్కడ దొంగతనాలు చేసి వెళ్లిపోవడం, మళ్లీ రావడం ఇలా పలు మార్లు చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగలను ఎంవీపీ క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా జోన్ క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. తమిళనాడులోని వెల్లూరు జిల్లాకు చెందిన గణేష్ శంకర్ (29), వి.మంజునాథన్ (29) మరో వ్యక్తి 2021 నుంచి నగరంలో నేరాలు చేస్తున్నారు. ఎంవీపీ కాలనీతో పాటు భీమిలి, ఆనందపురం తదితర ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడ్డారు. చోరీ సొత్తును విక్రయించి, ఆ సొమ్ముతో జల్సాలు చేసేవారు. ఈనెల 21న ఉదయం ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరులో శ్రీలక్ష్మీ నిలయం అపార్టుమెంట్ మొదటి అంతస్తులో పట్టపగలు చోరీ జరిగింది. యజమాని ఫణికిరణ్ వర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా వెంకోజీపాలెం కూడలి వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పలు నేరాలకు పాల్పడి నట్టు అంగీకరించారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన ఎస్ఐ జగదీష్, ఏఎస్ఐ కిషోర్‌బాబు, కానిస్టేబుళ్లు అప్పలరాజు, రవికుమార్, అగస్టీన్, జగత్ కిరణ్, సాయిలను సీఐ అభినందించారు.

మేడ పైనుంచి జారి పడి ఒకరి మృతి

తగరపువలస, మే 23 : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో తన ఇంటి మేడ పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన చిల్ల అప్పలరాజు (55) గురువారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలు ప్రకారం.. వ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్న అప్పలరాజు బుధవారం రాత్రి మద్యం మత్తులో మేడ మీద నుంచి కిందకు ఉమ్మి వేసే ప్రయత్నంలో జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు సమీపంలో ఉన్న సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. గురువారం ఉదయం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం నుంచి రూ.75 వేలు చోరీ

కూర్మన్నపాలెం, మే 23 : అగనంపూడి యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఉక్కు ఉద్యోగి ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలను అగంతకుడు తస్కరించారు. పెదమడకలో నివాసముంటున్న ఉక్కు ఉద్యోగి ఎన్‌బీ నాయక్ బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు అగనంపూడి యాక్సిస్ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లి తొలుత రూ.ఐదు వేలు డ్రా చేశారు. తర్వాత మళ్లీ రూ.మూడు వేలు తీసేందుకు యత్నించగా డబ్బులు రాలేదు. ఆ సమయంలో వెనక ఉన్న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి తాను ట్రై చేస్తానని చెప్పి నాయక్ ఏటీఎం కార్డు తీసుకుని చాకచాక్యంగా దాన్ని మార్చేశాడు. అనంతరం ఏటీఎం నుంచి డబ్బులు రావడం లేదని ఆ వ్యక్తి చెప్పడంతో నాయక్ కార్డు తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఏ-షిఫ్ట్ డ్యూటీకి వెళ్లిన నాయక్ బుధవారం రాత్రి రూ. 25 వేలు, గురువారం ఉదయం మరో రూ. 50 వేలు డ్రా చేసినట్టు ఫోన్‌లో మెసేజ్‌లు ఉండడంతో తన సహచర మిత్రుడు శ్రీనివాస్‌కు విషయాన్ని చెప్పి కార్డును బ్లాక్ చేయించారు. అనంతరం ఆయన దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎర్రంనాయుడు తెలిపారు.